


## ప్రభాకరం దేవ్

# పుట్టినరోజు

"ఏమిటి! ఈ రోజు మన 'పప్పీ'కి పుట్టినరోజా!" నవ్వుతూ ఫోనులో అడిగాడు సీనియర్ ఇంజనీరు వైకుంఠం.

"........."

"ష్యూర్. ఆఫీసు వదలగానే యింటికి వచ్చేస్తాను. ఫంక్షను సెలబ్రేట్ చేద్దాం." అన్నాడు రిసీవర్ను హుక్‌మీద వుంచి కర్చీఫ్‌తో ముఖం తుడుచుకున్నాడు.

సౌండ్‌ప్రూఫ్ గది అది. వైకుంఠంకు ఎదురుగా షార్టుహేండు పుస్తకం, పెన్సిలు పట్టుకొని నిల్చున్న నీరజ ఆశ్చర్యపోయింది.

వైకుంఠం వచ్చి నెలరోజులయింది. ఎప్పుడూ అతని ముఖం ధుమధుమలాడుతూ వుంటుంది. క్లర్కులమీద అజమాయిషీ చెలాయించడానికే తాను వున్నట్లుగా ప్రవర్తిస్తాడు. నోటికి వచ్చినట్లు వాగుతాడు. నీరజకు అతనంటే భయం. అతను లెటర్ డిక్టేట్ చేసినప్పుడు ప్రాణాలరచేతిలో పెట్టుకొని నోట్ చేసుకుంటుంది. కేకలతో అందర్నీ హడలగొట్టుంటాడు.

వైకుంఠం వచ్చిన నెలరోజుల్లోను అతని ముఖంలో చిరునవ్వు చూడడం నీరజకు యిదే ప్రథమం. అందుకనే ఆశ్చర్యపోయింది.

"నోట్ దిపాయింట్స్..." చెప్పడం ప్రారంభించాడు వైకుంఠం. నీరజ ఆలోచనలను పారద్రోలి వ్రాయడంలో మునిగిపోయింది.

లెటర్ పూర్తి అయ్యేసరికి లంచ్ టైం అయింది. ఆఫీసు గదిలో నుండి బైటపడింది నీరజ.

కేంటిన్‌లో కాఫీ త్రాగుతూ, హెడ్ క్లర్కు సుందరంతో "ఈరోజు ఆఫీసరుగారి అమ్మాయి పప్పీకి పుట్టిన రోజటండి." అంది నీరజ.

"నీకెలా తెలుసు?" అనుమానంగా ప్రశ్నించాడు హెచ్. సి.

"వాళ్ళావిడ గంటక్రితం ఫోన్ చేశారు." జవాబు చెప్పింది.

"అదా సంగతి! అందుకే, ఈరోజు యింతవరకూ మన కెవ్వరికీ మొగుడు చేత చీవాట్లు పడలేదు." కాఫీ సిప్ చేస్తూ అన్నాడు క్లర్కు అప్పారావు. ఆఫీసులో అందరికంటే హుషారుగా వుండేది అతనొక్కడే. క్రొత్తగా జాయినయ్యాడు.

అప్పారావుమాటలకు నీరజ నవ్వింది.

సుందరం కాఫీ తాగడం పూర్తిచేసి గ్లాసును బల్లమీద వుంచేస్తూ ..."మంచి అయిడియా వచ్చింది." అన్నాడు.

అందరూ సుందరాన్ని చూశారు, ఏమిటన్నట్లు.

"ఈరోజు ఆఫీసరుగారి అమ్మాయి 'పప్పీ' పుట్టిన రోజని అదృష్టవశాత్తు మనకు తెలిసింది. ఈ అవకాశాన్ని మనం వుపయోగించుకోవాలి. మనం ఆఫీసువిడిచిపెట్టేక ఆఫీసరుగారి యింటికి వెద్దాం. వాళ్ళ బేబీ పుట్టినరోజు కదా! ప్రజంట్సు తీసుకువెళ్ళి యిద్దాం." అన్నాడు

"గుడ్ అయిడియా! ఈ దెబ్బతో మన గురుడు అయిస్ అయిపోతాడు." అన్నాడు అప్పారావ్.

అందరికీ ఈ అయిడియా నచ్చింది.

పుట్టినరోజు బహుమతుల్ని పట్టుకెళ్ళి, ఈ అవకాశాన్ని వినియోగించుకుని, ఆఫీసరుచేత రోజూ తగిలే చీవాట్లను తప్పించుకోవచ్చని ఎవరికి వారే ఆలోచించారు.

"అయితే సాయంకాలం మనందరం కలిసి వెళ్దామా?" అడిగాడు హెడ్‌క్లర్క్.

"పిలవకుండా మనం వెళ్ళితే బాగుండదేమో?" అనుమానం వెలిబుచ్చింది నీరజ.

అప్పారావు ఫక్కుమని నవ్వేడు.

''మనం గుమస్తాలం!" మన ల్నెవరూ బొట్టూ కాటుకా పెట్టిపిలవరు,'' అన్నాడు.

"సరే వెళ్దాం..." అంది నీరజ.

* * *

సాయంకాలం తనింటికి వచ్చిన ఆఫీసు స్టాపునంతా చూసి ఆశ్చర్యపోయాడు వైకుంఠం.

''ఏం జరిగింది? మీరంతా యిలా కట్టకట్టుకొని ఎందుకొచ్చారు?''

ఆఫీసరు ధోరణికి వచ్చిన వాళ్లు కొంచెం భయపడ్డారు.

''మీ...అమ్మాయి గారు 'ప ప్పీ' పుట్టన రోజని తెలిసివచ్చాం..." మెల్లగా అన్నాడు హెడ్ క్లర్క్...

"మా అమ్మాయి పుట్టిన రోజని ఎవరు చెప్పారు?"

"నీరజగారండి."

నీరజ గుండె దడదడలాడింది.

''నీకు ఈవిషయంఎలా తెలిసింది."

"మీకు ఉదయం యింటి నుండి ఫోన్‌కాల్ వచ్చింది కదండీ...'' నని గింది నీరజ.

నీరజ మాటలకు గది దద్దరిల్లేలాగ నవ్వేడు వైకుంఠం అయిదు నిముషాల వరకూ నవ్వు ఆగింది కాదు.

స్టాఫ్ అంతా ఆఫీసరు నవ్వును విస్మయంగాచూస్తూ, ప్రజంట్సు చేతపట్టుకొని శిలాప్రతిమల్లాగ నిలబడిపోయారు.

నవ్వి, నవ్వి అలిసిపోయి సోఫాలో కూర్చుండిపోయాడు వైకుంఠం.

"పప్పీ అంటే మా అమ్మాయికాదు. మేం పెంచుకొనే కుక్క పేరు అది.''

ఆఫీసరు వైకుంఠం మాటలకు వచ్చిన వాళ్ళంతా అవాక్కయి పోయారు.

